epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దిన పత్రిక




ఎయిర్ పోర్ట్ అభివృద్ధిపై
## సమీక్ష
2

సంపుటి : 01 | సంచిక : 139 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 17 ఏప్రిల్ 2026 | పేజీలు : 4

‘గల్లీ చిన్నది.. బెల్టు షాపులు పెద్దవి’ అన్నట్లుగా పల్లెలు, పట్టణాల్లో పరిస్థితి నెలకొన్నది. అమాసకో.. పున్నానికో.. అన్నట్లుగా అప్పుడప్పుడు ఈ బెల్టుషాపులపై చర్చ వినిపిస్తది. నిరసనలు కనిపిస్తవి. కానీ ఆ షాపులు అట్లనే నడుస్తయి. నాలుగు రోజులు ఆబ్కారీ ఆఫీసర్ల హడావుడి ఉంటది. ఆ తరువాత అంతా ‘మామూలే..’ కానీ ఈ సారి ఈ చర్చ మరింత పెద్దదైంది. ఎందుకంటే సాక్షాత్తు ఎమ్మెల్యేనే ఈ షాపుల నిర్వహణపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ జయంతి సాక్షిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ కామెంట్లతో బెల్టు షాపు నిర్వాహకులే కాకుండా పాలకపక్షంలోనూ గుబులు మొదలైంది. ‘మీరు బంద్ చేస్తారా.. మహిళలను తీసుకెళ్లి షాపులను మూపించే పని నన్ను చేయమంటారా? అంటూ బహిరంగ వేదికలో పల్లా సవాల్ విసరడం పెద్ద హాట్ టాపిక్ గా మారింది.

*- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా*




2లో.

# బెల్టు తీస్తా!

- సిండికేటు దందాపై ‘పల్లా’ నజర్
- లిక్కర్‌పై సమరశంఖం మోగిస్తామని హెచ్చరిక
- పోలీసులకు సవాల్ గా మారిన ఎమ్మెల్యే వ్యాఖ్యలు
- కలెక్టరేట్, పోలీసు శాఖలే టార్గెట్
- ఆఫీసర్లతో కాదంటే తానే రంగంలోకి దిగుతానని కామెంట్
- అప్రమత్తమైన వైన్ షాపులు, సిండికేటు నిర్వాహకులు



ప్రభుత్వ పథకాలు
## సమర్థంగా అమలు

- మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక
- మండల సభలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

3 లో



ప్రాణం అమూల్యం..
## ప్రయాణం సురక్షితం

- అవగాహనే ఆయుధంగా ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం

4 లో

మన చౌరాస్తా
తెలుగు దిన పత్రిక
శుక్రవారం, 17 ఏప్రిల్ 2026
Mana Chourasta


# నేనే బెల్టు తీస్తా!

## సిండికేటు దందాపై 'పల్లా' నజర్

- లిక్కర్‌పై సమరశంఖం మోగిస్తామని హెచ్చరిక
- పోలీసులకు సవాల్ గా మారిన ఎమ్మెల్యే వ్యాఖ్యలు
- కలెక్టరేట్, పోలీసు శాఖలే టార్గెట్
- ఆఫీసర్లతో కాదంటే తానే రంగంలోకి దిగుతానని కామెంట్
- అప్రమత్తమైన వైన్ షాపులు, సిండికేటు నిర్వాహకులు

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా)




'గల్లీ చిన్నది.. బెల్టు షాపులు పెద్దవి' అన్నట్లుగా పల్లెలు, పట్టణాల్లో పరిస్థితి నెలకొన్నది. అమాసకో.. పున్నానికో.. అన్నట్లుగా అప్పుడప్పుడు ఈ బెల్టుషాపులపై చర్చ వినిపిస్తది. నిరసనలు కనిపిస్తవి. కానీ ఆ షాపులు అట్లనే నడుస్తయి. నాలుగు రోజులు ఆబ్కారీ ఆఫీసర్ల హడావుడి ఉంటది. ఆ తరువాత అంతా మామూలే. కానీ ఈసారి ఈ చర్చ మరింత పెద్దదైంది. ఎందుకంటే సాక్షాత్తు ఎమ్మెల్యేనే ఈ షాపుల నిర్వహణపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ జయంతి సాక్షిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ కామెంట్లతో బెల్టుషాపు నిర్వాహకులే కాకుండా పాలకపక్షంలోనూ గుబులు మొదలైంది. 'మీరు బంద్ చేస్తారా.. మహిళలను తీసుకెళ్లి షాపులను మూపించే పని నన్ను చేయమంటారా? అంటూ బహిరంగ వేదికలో పల్లా సవాల్ విసరడం పెద్ద హాట్ టాపిక్ గా మారింది. పల్లా వ్యాఖ్యలతో ఓ వైపు అధికారుల్లో, మరోవైపు లిక్కర్ వ్యాపారుల్లో టెన్షన్ మొదలైంది. వైన్షాపులకు ప్రధాన ఆదాయ వనరు బెల్టుషాపులే.. జనగామ జిల్లాలో సుమారు 400 బెల్టుషాపులున్నాయి. ఒక్కో గ్రామంలో నాలుగైదు నడుస్తుండగా, కేవలం జనగామ పట్టణంలోనే వంద షాపుల వరకు నడుస్తున్నాయి. ఈ షాపుల నిర్వహణలో మామూళ్ల రూపంలో ఎంతో మంది అధికారులు, రాజకీయ నాయకులకు లబ్ధి చేకూరుతోంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బెల్టు షాపుల భరతం పడుతామని హెచ్చరించడంతో ఈ షాపులపై ఆదాయం పొందుతున్న వారిలో అంతర్మథనం మొదలైంది. ఊరూరూ తిరిగి షాపులను మూసివేయాలన్న ఆలోచనలో ఎమ్మెల్యే పల్లా ఉండగా, షాపులను ఇబ్బందులు లేకుండా ఎలా ముందుకు నడిపించాలనే వ్యూహంలో వ్యాపారులు ఉన్నారు. ఈ బెల్టు రగడలో ఎమ్మెల్యే పంతం నెగ్గించుకుంటారా? లేక వ్యాపారులే పైచేయి సాధిస్తారా? అనేది ఆసక్తికర అంశంగా మారింది.

### ఎమ్మెల్యే ఏమన్నారంటే..

ఇటీవల జరిగిన అంబేద్కర్ జయంతి సాక్షిగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జిల్లా కలెక్టర్, పోలీసు శాఖలపై తీవ్రంగా విమర్శించారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంటే జనగామలో మాత్రం మరో రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించారు. జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలెక్టరేట్ ప్రహరీ ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న వనిత టీ స్టాల్ ను ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకోవడంపై ఎమ్మెల్యే ఆక్షేపించారు. ఓ దళిత మహిళను అధికారులు వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. ఇదే సమయంలో మద్యం వ్యాపారులపై విరుచుకు పడ్డారు. 'జనగామలో మద్యం వ్యాపారులు సిండికేట్ మారి ప్రజల రక్తాన్ని పీల్చుతున్నారు.. వాడవాడలా బెల్టు షాపులు నిర్వహిస్తూ.. ఉదయం 4 గంటల నుంచే అమ్మకాలు చేస్తున్నారు. జనగామలో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు కార్యాలయాల ఎదురుగా ఉన్న బెల్ట్ షాపులు నడుస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. పోలీసులు వారంలో రోజుల్లో బెల్టు షాపులను మూసేయకుంటే.. తానే దళిత, మహిళా సంఘాలతో కలిసి ప్రత్యేక్షంగా రంగాంలోకి దిగుతామని హెచ్చరించారు.

### మద్యం ప్రియుల జేబులు గుల్ల

**జనగామలో మద్యం వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ప్రత్యేక స్టిక్కర్లు వేసి బెల్ట్ షాపులను మందు సరఫరా చేస్తూ కాసులు పండించుకుంటున్నారు. సిండికేట్ వ్యాపారులు క్వాటర్‌కు ఎమ్మార్పీ ధరకంటే రూ.20 ఎక్కువకు బెల్టు షాపులకు అమ్ముతుండగా.. వారు మరో రూ.20 పెంచి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో క్వాటర్ కు రూ.40, ఆఫ్కు రూ.80, ఫుల్ బాటిల్కు రూ.160 చొప్పన అధికంగా తీసుకుంటూ మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారు.**






సిండికేట్ వ్యాపారులు వేసిన సిక్కర్లు



## ఎయిర్ పోర్ట్ అభివృద్ధిపై సమీక్ష

**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు మామునూర్ ఎయిర్‌పోర్ట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ చాంబర్‌లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, అధికారులు ఎం.రాజా కిషోర్, రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌత్ రీజన్ అచింత కుమార్ దత్తా, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ జీఎం హైదరాబాద్ జి.నటరాజు, ఏజీఎం (ఇంజినీరింగ్-సివిల్) & ల్యాండ్ మేనేజ్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు తమ సందర్శనలో పరిశీలించిన అంశాలను వివరించారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చిస్తూ, రన్‌వే స్థితి, టెర్మినల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించి, అవసరమైన మెరుగుదలలపై చర్చించారు. మామునూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ద్వారా ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, పరిశ్రమలు,పర్యాటక రంగాలకు ఊతమిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, ఆర్డిఓ వరంగల్ సుమ, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్, ఖిలా వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ సంబంధిత శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అడ్డుపడుతున్న ఏడీ

**జనగామ, మన చౌరాస్తా :** ఏడీ సత్యనారాయణ మూర్తి జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలకు సకాలంలో స్పందించక, తప్పుడు సమాచారం ఇస్తూ సమస్యల పరిష్కారానికి అడ్డుపడుతున్నాడని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి షరీఫ్, ఇప్ప రాంరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల జనగామలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కీర్తి శ్రీధర్ అనే ఎస్జీటీ ఉపాధ్యాయుడు జిల్లా విద్యా కార్యాలయంలో 6 సంవత్సరాలకు పైగా అక్రమంగా డిప్యూటీషన్‌లో కొనసాగుతున్నారన్నారు. డిప్యూటేషన్ పొడిగింపు ఉత్తర్వులు లేకుండా ఎవ్వరిని డిప్యుటేషన్‌లో కొనసాగించరాదని ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు అమలుకాకుండా ఏడీ సత్యనారాయణ మూర్తి జిల్లా విద్యా శాఖాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ అతడిని పాఠశాలకు పంపించకుండా మేనేజ్ చేయడం మంచిది కాదన్నారు. గూడూరు(ఐ) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజపై, తొర్రూరు (జె) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ పై వచ్చిన ఆరోపణలకు మాజీ జిల్లా విద్యా శాఖాధికారి పింకేష్ కుమార్ విచారణకు ఆదేశించారని, ఆ విచారణ అవసరం లేదని ఏడీ విచారణ జరగకుండా అడ్డుపడుతూ ప్రధానోపాధ్యాయులను కాపాడే ప్రయత్నం చేయడమేమిటని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖిలాషాపూర్ లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు సమస్య పరిష్కారంలో కూడా ఏడీ సత్యనారాయణ మూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు సమస్య పరిష్కారం కాకుండా సాగదీస్తున్నారన్నారు. ప్రస్తుతం జిల్లా విద్యా శాఖాధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ జిల్లా విద్యా కార్యాలయంలో ఆరున్నరేళ్లకు పైగా అక్రమ డిపుటేషన్‌లో ఉన్న కీర్తి శ్రీధర్ ను పాఠశాలకు పంపించాలని, గూడూరు, తొర్రూరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అధ్యాపక జ్వాల సంపాదక వర్గ సభ్యురాలు జి.కళావతి, జిల్లా కమిటీ సభ్యులు చొక్కయ్య, శివరాం, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దాహం పేరుతో వచ్చి.. పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు

**పరకాల, మన చౌరాస్తా :** మంచినీళ్లు కావాలంటూ వచ్చిన ఓ ఆగంతకుడు కనురెప్ప పాటులో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించిన ఘటన గీసుగొండ పరిధిలోని సూర్య తండాలో కలకలం రేపింది. దుగ్గొండి మండలం మహమ్మదపురానికి చెందిన పాలడుగుల నరసమ్మ భర్త చంద్రయ్యతో కలిసి కూతురు కవిత గృహప్రవేశం కోసం అక్కడికి వెళ్లారు. ఏప్రిల్ 15న దంపతులిద్దరూ ఇంటి బయట కూర్చుని ఉండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ దుండగుడు దాహం వేస్తోందంటూ దగ్గరకు వచ్చాడు. ఆ మరుక్షణమే నరసమ్మ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పారిపోయిన నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు గీసుగొండ సీఐ డి.విశ్వేశ్వర్ వెల్లడించారు.

# ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు

- **మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక**
- **మండల సభలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**




**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో వివిధ పథకాల లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయని సంతోషాన్ని పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను కలెక్టర్ ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మండల ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని.. ప్రతీ గడప కి అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జనగామ జిల్లా రాష్ట్ర స్థాయిలో టాప్2లో నిలవడం గర్వకారణమని తెలిపారు. దీని కోసం ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు సమర్థంగా పని చేయడం ముఖ్య కారణమని అభినందించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో పెండింగ్ లో ఉన్న ఇళ్లను కూడా వేగవంతంగా పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేసే విధంగా లబ్ధిదారులకు సర్పంచులు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక తరలింపుకి సంబంధించి పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేయడం జరుగుతోందని వివరించారు. రేషన్ కార్డుల దరఖాస్తు, మంజూరు నిరంతర ప్రక్రియ అని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండల సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, మండల ప్రత్యేక అధికారి కోదండరాములు, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేష్, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల అంటే జైత్రయాత్రకు నాంది.!

- **గులాబీ జెండా మళ్లీ ఎగురవేయడం ఖాయం**
- **కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ప్రజల సంకల్పం**
- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



**జగిత్యాల, మన చౌరాస్తా :** ఏప్రిల్ 20న జగిత్యాలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ ఎమ్మె ల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు. జగిత్యాల సభతో ఈ ప్రభుత్వానికి గట్టి కనువిప్పు కలుగుతుందన్నారు. కేసీఆర్ అనుభవం, నిబద్ధత పార్టీకి గొప్ప బలమని పేర్కొన్నారు. దాదాపు ఐదు దశాబ్దాల రాజ కీయ అనుభవం కలిగిన జీవన్ రెడ్డి నిజాయితీకి చిరు నామాగా నిలిచిన సీనియర్ నాయకుడని కొనియాడారు. నచ్చని విధా నాలు, నచ్చని రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడి ప్రజల కోసం స్వచ్ఛమైన రాజకీ యాన్ని ఎంచుకోవడం ఆయన ధైర్యమని అన్నారు.

## అధికార పార్టీని వదిలి..

సాధారణంగా అధికార పార్టీని వదిలి ప్రతిపక్షంలోకి రావడం సులువు కాదు.. కానీ ప్రజల కోసమే జీవన్రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని పల్లా పేర్కొన్నారు. జగిత్యాల నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి సభలో వారి అంకితభావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జీవన్ రెడ్డి సాధారణ జీవితం గడిపిన నాయకుడని, ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే ఆదర్శ వ్యక్తి అని కొనియాడారు. గ్రామాలు, పట్టణాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనందరం ఒక్కటిగా నిలిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం వందకు వంద శాతం తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల అంటే జైత్రయాత్రకు నాంది అని, ఇక్కడి నుంచే భవిష్యత్ రాజకీయాలకు పునాది పడు తుందని చెప్పారు. 2029 ఎన్నికలకు జగిత్యాల గడ్డనే బలమైన కేంద్రంగా మారుస్తామని పేర్కొన్నారు.

# నాడు మోదీ.. నేడు తేజస్వీ

- **ప్రత్యేక తెలంగాణపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ విద్వేషం**
- **మాజీ ఎమ్మెల్యే నన్నపునేని**

**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** ఉద్యమసారథి కేసీఆర్‌గా నాయకత్వంలో 14 ఏళ్ల పాటు శాంతియుతంగా జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటంతో 1200 మంది తెలంగాణ బిడ్డల ప్రాణా త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనలాంటి సంఘటనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య యాదవ్ కుసంస్కార వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. ఇది ముమ్మాటికి తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను, అమరుల ఆత్మబలిదానాలను అవమానించినట్లే అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అహంకారపూరితంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, అమరుల ప్రాణత్యాగాలను అవమానిస్తుంటే తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు చేతకాని దద్దమ్మల్లాగా నోరు మూసుకుని ఉండడం సిగ్గు చేటని అన్నారు. ముమ్మాటికీ తెలంగాణ అంటే బీజేపీకి విద్వేష భావమే.. పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపర్చిన బీజేపీ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# తడిపొడి చెత్తపై అవగాహన కార్యక్రమం

**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశానుసారం 32 డివిజన్ లోని ఉర్సు గుట్ట వద్ద గల డి ఆర్ సి సి (పొడి వనరుల సేకరణ కేంద్రం ) సెంటర్లో 32, 33 , 40 డివిజన్లోని స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు తడిపొడి చెత్త వేరుపరచుట కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా స్థానిక 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజా రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు. సదస్సును ఉద్దేశించి రాజారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ప్రతి ఇంటి నుండి చెత్తను తడిపొడిగా వేరు చేసి తీసుకోవాలని. తీసుకున్న తడి చెత్తను పోతన నగర్ డంపింగ్ యార్డ్ కు తరలించాలని, పొడి చెత్తను (డి ఆర్ సి సి) (పొడి వనరుల సేకరణ కేంద్రం ) సెంటర్కు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో డ్రైవర్ వారి అప్పగించిన 600 గృహాల సముదాయములోని ప్రతి ఇంటి నుండి ప్రతిరోజు చెత్తను తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అదే విధంగా చెత్త తరలించు వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు నడిపే క్రమంలో పాటించవలసిన జాగ్రత్తలను గురించి వివరించడం జరిగింది (పొడి వనరుల సేకరణ కేంద్రం ) సెంటర్ కు క్రమం తప్పకుండా వచ్చి పొడి చెత్తను అందించిన స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు ప్రోత్సాహకరంగా టిఫిన్ బాక్స్‌వాటర్ బాటిల్ ను స్థానిక 32 వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి మరియు సి ఎం హెచ్ ఓ డిఆర్ రాజా రెడ్డి మరియు డి ఆర్ .రాజేష్ చేతుల మీదుగా ( పొడి వనరుల సేకరణ కేంద్రం ) సెంటర్ ఉర్సుగుట్ట వారు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్స్ నరేందర్ , శ్రీను , స్థానిక 32 వ డివిజన్ సానిటరీ ఇన్స్పెక్టర్ రాజు ఐటీసీ నుండి పవన్ (పొడి వనరుల సేకరణ కేంద్రం ) సెంటర్ ఆపరేటర్ మాదాసి. సుమలతబిక్షపతి, జవాన్స్ ఓరుగంటి జీవన్, సారంగపాణి, కిరణ్, కృష్ణ, ఆదాం, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






# అన్ని దానాల కన్నా.. అన్నదానం మిన్న

**వరంగల్, మన చౌరాస్తా :** న్యూ శాంపేట చౌరాస్తా హంటర్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గత నాలుగు సంవత్సరాల నుండి భక్తాంజనేయ స్వామి అన్నదాన కమిటీ ద్వారా దాతల సహాయ సహకారాలతో శ్రీరామనవమి నుండి హనుమాన్ జయంతి వరకు దాదాపు 45 రోజుల ఈ కాలవ్యవధిలో ప్రతిరోజు 600 నుండి 800 మందికి తగ్గకుండా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేస్తున్నారంటే ఇది అతిశయోక్తి కాదు. కచ్చితంగా ఆ ఆంజనేయ స్వామి వీరికి ఇచ్చిన సంకల్ప బలం. ఏ హనుమాన్ భక్తుల్ని అడిగిన న్యూ శాయంపేట చౌరస్తా హంటర్ రోడ్డులో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో కోరిన కోరికలను తీర్చే కల్ప తరువు శ్రీ భక్తాంజనేయ స్వామి వారు అని పక్కనే వేప చెట్టు రాళ్లచెట్టు పక్కన నాగేంద్ర స్వామి చాలా ఆకర్షణీయంగానే కాకుండా ఏదో తెలియని అలౌకికశక్తి భక్తుల మనసును కట్టిపడేస్తూ మనసు ఆహ్లాదకరంగా ఉండడమే కాకుండా నిరంతరం రామనామ స్మరణతో భజనలు, హనుమాన్ చాలీసా తో పారాయణాలు జరుగుతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చిన భక్తులందరికీ ఇంకా పూర్తిగా సౌకర్యాలు అందించలేకపోతున్నామని ఆర్ సి సి షెడ్ నిర్మాణం ద్వారా భక్తులకు ఏకకాలంలో 500 నుండి 600 మందికి భోజనం చేయడానికి ఉండడానికి వసతి కొరకు దాదాపు 11 లక్షల పైచిలుకు వ్యయంతో దాతల సహాయ సహకారముతో నిర్మించామని ఇంకా భక్తులు దాతలు సహకరిస్తే స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంది ఇంకా ఒక బోరు నిర్మాణం చేపట్టాలని అన్నారు. దాతలు ఎవరైనా విరాళాలు చందాదారులు దేవాలయ అభివృద్ధి కొరకు విరాళాలు ఇవ్వాలనుకుంటే శ్యామ్ 9550020451 వరకు సంప్రదించి గూగుల్ పే ద్వారా గాని ఫోన్ పే ద్వారా గాని ఇతరత్రా ఆన్లైన్ ట్రాన్జక్షన్లు ద్వారా చెల్లించవచ్చు అని తెలిపారు.

మన చౌరాస్తా
తెలుగు దిన పత్రిక



# ప్రాణం అమూల్యం.. ప్రయాణం సురక్షితం

## అవగాహనే ఆయుధంగా 'అరైవ్ అలైవ్'

**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** క్షణకాలం నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంటున్న ప్రస్తుత తరుణంలో, వాహనదారుల్లో మార్పు తెచ్చేందుకు పోలీస్, రవాణా శాఖలు సంయుక్తంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం సర్వత్రా ఆలోచింపజేస్తోంది. హనుమకొండ జిల్లా చింతగట్టు కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో అడిషనల్ డీజీపీ చారు సిన్హా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, డీటీసీ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొని సురక్షిత ప్రయాణ ప్రాముఖ్యతపై దిశానిర్దేశం చేశారు. అతివేగం, మద్యం మత్తు, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు చూపిన దృశ్యరూపకాలతో పాటు, రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన బాలుడు రుత్విక్ చెప్పిన మాటలు సభికులను కంటతడి పెట్టించాయి. ఇంటి వద్ద మనకోసం ఎదురు చూసే కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని,



అవసరమైన వారు తప్పనిసరిగా కంటి అద్దాలు వాడాలని అధికారులు సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, ట్రాఫిక్ నిబంధనలు తు.చ. తప్పకుండా పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగిస్తామని సభికులందరితో ప్రతిజ్ఞ చేయించారు.



# బీజేపీ ఎంపీకి పల్లా వార్నింగ్..!

- తెలంగాణ ఏర్పాటుపై సూర్య చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఖండించాలి
- లేకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజల తీర్పు తప్పదు
- తెలంగాణపై బీజేపీ నేతలు పదేపదే విషం చిమ్ముతున్నారు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జగిత్యాల, మన చౌరాస్తా :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీలు ఖండించకుండా మౌనం వహించడం సిగ్గుచేటు అని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభకు ఏర్పాట్ల స్థల పరిశీలన అనంతరం ఆయన బీజేపీ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. తెలంగాణపై పదేపదే విషం చిమ్ముతున్న బీజేపీ నేతలపై పల్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీజేపీ సభ్యులే రాజీనామా చేసి మాతో కలిసి వచ్చిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఇద్దరు కేంద్రమంత్రులు, పలువురు బీజేపీ ప్రజాప్రతినిధులు తెలంగాణపై జరుగుతున్న అన్యాయాలపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. తెలంగాణ గురించి మాట్లాడాల్సిన సమయంలో మౌనం వహిస్తూ, ఇతర రాష్ట్ర నాయకులను సంతోషపెట్టే రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. అవసరమైనప్పుడు తెలంగాణకు మద్దతిచ్చినట్టు నటించి, ప్రతి క్షణం వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని బీజేపీపై విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఏడు మండలాలను దూరం చేశారని పేర్కొన్నారు. సీలేరు ప్రాజెక్టును దక్కించుకోవడంతో పాటు, ఐటీఆర్ వంటి కీలక ప్రాజెక్టులను ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఒక్క ఐఐఎమ్ వంటి ప్రముఖ విద్యాసంస్థను కూడా తెలంగాణకు ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రం నుంచి సరైన నిధులు ఇవ్వకుండా తెలంగాణపై వివక్ష చూపుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్న బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. తెలంగాణ పేరుతో గెలిచి, తెలంగాణ అవమానాన్ని చూసి నిశ్శబ్దంగా కూర్చున్న ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తేజస్వి సూర్య వ్యాఖ్యలను వెంటనే ఖండించాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించినందుకు బీజేపీ పార్టీ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలు తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఢిల్లీ పెద్దల ముందు వంగి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తే, ప్రజలు తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.






Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**